క్లుప్తంగా

పీహెచ్‌సీలో పాము కలకలం


నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ సాయి

గుర్ల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నాగుపాము గురువారం కలకలం రేపింది. వైద్య సిబ్బంది రోగులకు చికిత్స అందిస్తుండగా ఆస్పత్రిలోకి నాగుపాము రావడంతో సిబ్బంది, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. విజయనగరం నుంచి స్నేక్ క్యాచర్ సాయి వచ్చి నాగుపామును పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ పూర్ణిమ

జామి: మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ, ఏఎస్‌ఏ శాంతి ఆధ్వర్యంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. పంటకోత ప్రయోగాలు ఏ విధంగా చేపట్టాలి.. ఈ పంట నమోదు ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. .

30 వినతుల స్వీకరణ


ఫోరం చైర్మన్‌కు ఫిర్యాదులు అందజేస్తున్న వినియోగదారులు

చీపురుపల్లి: విద్యుత్ సమస్యలకు సంబంధించి నిర్వహించిన పరిష్కార వేదికలో చీపురుపల్లి, గరివిడి మండలాల నుంచి 30 వినతులు వచ్చాయి. పట్టణంలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో విద్యుత్ వినియోగదారులు ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ పరిష్కార న్యాయస్థాన క్యాంప్ కోర్టు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సభ్యులు ఎస్.సుబ్బారావు, సులేఖారాణి వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. లో ఓల్టేజీ, అధిక బిల్లులపై ఎక్కువ వినతులు అందాయి. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోరం చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఈసీఎస్ ఎం.డి సన్యాసినాయుడు, ఏఈ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మూడంతస్తుల భవనంపై పిడుగు


పిడుగు పడిన మూడో అంతస్తు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ షణ్ముకరావు, తదితరులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల మూడంతస్తుల భవనంపై గురువారం సాయంత్రం పిడుగు పడడంతో భవనం బీటలు వారింది. దీంతో ఈ ఇంటి వరుసలో ఉన్న 43 ఇళ్లల్లో గల టీవీలు, ఫ్రిజ్‌లు, లైట్లు, ఇన్వర్టర్లు, ఫ్యాన్లు, తదితర వస్తువులు కాలిపోయాయి. లక్షల రూపాయలలో నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షణ్ముకరావు, వీఆర్‌ఓ సరోజిని ఇళ్లను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


దుకాణాల్లో సోదాలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగూర్ మీరా

శృంగవరపుకోట: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగూర్ మీరా గురువారం పట్టణంలోని వాటర్‌ప్లాంట్లు, ఆయిల్ దుకాణాలపై సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్లాంట్లు, దుకాణాల నుంచి శాంపిల్స్ సేకరించారు. పూర్తి స్థాయి రికార్డులతో యజమానులు జిల్లా కార్యాలయానికి రావాలని ఆదేశించారు. అనంతరం సబ్‌జైల్‌లో ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.

గ్రామాల్లో దాహం కేకలు..

- నెలల తరబడి వేధిస్తున్న తాగునీటి సమస్య
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


ఏడాదిన్నర కాలంగా సుజలధార నీటి సరఫరా జరగని కందిపేట గ్రామం


ఏడాది కాలంగా పడకేసిన నీటిపథకం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఏ ఒక్క గ్రామానికీ తాగునీటి సమస్య లేకుండా చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు పలు సమావేశాల్లో స్పష్టమైన హామీలిచ్చారు. కాని ఆచరణలో మాత్రం అమలు చేయలేకపోయారు. గరివిడి మండలంలోని కోడూరు, కందిపేట, కొండలక్ష్మీపురం గ్రామాల్లో ఏడాదిగా దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఎక్కడైనా సాధారణంగా రెండు రోజులు, కాకపోతే వారం రోజులు తాగునీటి సరఫరా నిలిచిపోతుంటుంది. పైప్‌లైన్లు, మోటార్లు మరమ్మతులకు గురైతే వారం, పది రోజులు నీటి సరఫరా నిలిచిపోవడం సహజం. కాని కోడూరు, కందిపేట, కొండలక్ష్మీపురం గ్రామాల్లో మాత్రం ఏడాది కాలంగా ఇందిరమ్మ సుజలధార పథకం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఉండే ఇందిరమ్మ సుజలధార నీళ్ల ట్యాంకులకు నాగావళి నది నుంచి నీటి సరఫరా అందకపోవడంతో.. స్థానికంగా ఉన్న బోర్ల ద్వారా నీటిని ఎక్కించి సరఫరా చేస్తున్నా.. అంతంతమాత్రంగానే ఉందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. గతంలో నాగావళి నది నుంచి నీటిని సుజలధార ట్యాంక్‌లకు ఎక్కించి అక్కడ నుంచి పైప్‌లైన్‌ల ద్వారా ఉదయం, సాయంత్రం సరఫరా చేసేవారు. ఇప్పుడు నది నంచి నీటిని తరలించేక్రమంలో ఇబ్బందులేర్పడ్డాయి. దీంతో బోర్ల నుంచి నీరు ఎక్కించి సరఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా.. విద్యుత్ సమస్యల వల్ల బోర్లు కూడా పనిచేయడం లేదు. ప్రస్తుతం వ్యవసాయ బావుల నీటిని వినియోగించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇందిరమ్మ సుజలధార పథకం సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ అధికారులుకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేకపోతుందని ప్రజాప్రతినిధులు,ప్రజలు వాపోతున్నారు.

ఏడాదిన్నర కాలంగా..

మా గ్రామం కందిపేటలో ఏడాదిన్నర కాలంగా సుజలధార తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో 210 నివాసాలున్నాయి. ఈ నివాసాలన్నింటికీ సుజలధార నీరే ఆధారం. తప్పనిసరి పరిస్థితుల్లో బోర్ల నుంచి ట్యాంక్‌లకు నీరు ఎక్కించి సరఫరా చేయాలని ప్రయత్నిస్తున్నా చాలా కష్టంగా ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– కంది శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు, కందిపేట గ్రామం

ఇబ్బంది పడుతున్నారు..

కోడూరు గ్రామంలో తొమ్మిది నెలలుగా తాగునీటి సరఫరా జరగడం లేదు. గ్రామంలో సుమారు 700 ఇళ్లున్నాయి. రెండు సుజలధార ట్యాంక్‌లున్నా నీటి సరఫరా జరగడం లేదు. నాగావళి నుంచి రావాల్సిన నీరు రాకపోవడంతో రెండు బోర్లు ఏర్పాటు చేసి నీటిని ఎక్కిస్తున్నాం. కరెంటు లేకపోతే నీటి సరఫరా నిలిచిపోతుంది. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– గేదెల ఆదినారాయణ, మాజీ సర్పంచ్, కోడూరు గ్రామం

మాజీ సీఎంను కలిసిన జిల్లా నాయకులు


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి శాలువా వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

చీపురుపల్లి/దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం మెడికల్ కళాశాల భవనాల సందర్శనకు గురువారం వచ్చిన జగన్ మోహన్‌రెడ్డిని బెల్లాన చంద్రశేఖర్, బొత్స అప్పలనరసయ్యలు కలిసి, పలు అంశాలపై మాట్లాడారు

న్యాయమూర్తిపై దాడి అమానుషం


చీపురుపల్లి రూరల్ : దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



కొత్తవలస: గాంధీనగర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఈనెల ఆరో తేదీన న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమని సీపీఎం నాయకులు అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సీపీఎం నాయకులు గురువారం గరివిడిలో నిరసన తెలియజేశారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.గౌరినాయడు, జె.విశ్వనాథరాజు, సన్యాసినాయుడు, ఎస్.రమణ, సత్యం పాల్గొన్నారు.

న్యాయమూర్తికే రక్షణ లేకపోతే ఎలా?,..

కొత్తవలస: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే ఎలా అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు ఆన్నారు. న్యాయమూర్తి గవాయ్‌పై దాడిచేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల కేంద్రంతో పాటు గాంధీనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో సత్యనారాయణ, శ్రీను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళులు


రతన్‌టాటా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సహాయ్ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలో గల వి.కన్వెన్షన్ హాల్ వద్ద సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రతన్‌టాటా వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌టాటా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతదేశపు పారిశ్రామికవేత్తగా, ఉదార స్వభావం గల వ్యక్తిగా రతన్‌టాటాకు ఎంతో మంచి పేరు ఉందన్నారు. వ్యాపారంలో విలువలు పాటించడంతో పాటు ఆయన చేసిన సేవా కార్యక్రమాలకు గాను కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్, పద్మ విభూషణ్ వంటి పురస్కారాలు అందజేసిందన్నారు. కార్యక్రమంలో సహాయ్ అధ్యక్షుడు ఉప్పు శ్రీను, కానురు వెంకటరమణ, శంకర్, జీఎస్‌ఆర్, కెల్ల రమణ, రామారావు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో రెండు చెరువులకు గండి

లక్కవరపుకోట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో గల చెరువులు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. మండలంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో గల రెండు చెరువులకు బుధవారం రాత్రి గండి పడడంతో కింద పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెరువులకు గండ్లు పూడ్చాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన..


చీపురుపల్లి: ఏరియా ఆస్పత్రిలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ సుధీర్, తదితరులు


గజపతినగరం: శ్రీనివాసా నర్సింగ్ హోమ్‌లో జీఎస్టీ తగ్గుదలపై అవగాహన కల్పిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ


కొత్తవలస: ముసిరాం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది నరసింహారావు, జగదాంబ, పద్మావతి, సత్యారావు, తదితరులు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను తగ్గించడంతో మందులు, నిత్యావసర వస్తువులు, ద్విచక్ర వాహనాలు, కార్ల ధరలు బాగా తగ్గాయి. దీంతో మండల అధికారులు వాడవాడలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఏయే వస్తువులు ఎంతెంత తగ్గాయో వివరిస్తూ, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. ఈక్రమంలో చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస మండలాల్లో అధికారులు గురువారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు.

– చీపురుపల్లి/ గజపతినగరం/కొత్తవలస

సమ్మెకు సిద్ధమైన వీఓఏలు


ఏపీఎం అప్పలనాయుడుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వీఓఏలు

చీపురుపల్లి: గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (వెలుగు) ఆధ్వర్యంలో పని చేస్తున్న వీఓఏలు (యానిమేటర్స్) సమ్మె చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు.. చీపురుపల్లి మండల వీఓఏల సంఘం సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటిస్తూ, వెలుగు ఏపీఎం అప్పలనాయుడుకు గురువారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వీఓఏలు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందనానరు. సెర్ప్ అధికారులు రాష్ట్ర స్థాయిలో సమావేశం నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు తక్షణమే చెల్లించడంతో పాటు ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేస్తూ రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలన్నారు.

ప్రజలకు సురక్షిత నీరు


ఇంటింటి కుళాయిల పనితీరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ మల్లికార్జునరావు, తదితరులు

గుర్ల: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని జెడ్పీ సీఈఓ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండలంలోని కెల్లలో జల్‌జీవన్ మిషన్ పనితీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలు, సర్వేల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఓ డి. మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కవిత, జేఈ సత్యం పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తం


వరి పంటకు ఆశించిన తెగుళ్లను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు లక్ష్మణ్, శ్రీనివాస్

బొండపల్లి: ఖరీఫ్ వరి పంటకు ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కెల్ల లక్ష్మణ్, ఎంఎంవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గొట్లాం గ్రామంలో గల వరి పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎంటీయూ 1121 వరి పంటకు ఎక్కువగా పాముపొడ తెగులు సోకుతోందన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ గజపతినగరం ఏడీఏ నిర్మలాజ్యోతి, ఏఓ పీవీ మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంటకోత ప్రయోగాలు..

ఖరీఫ్ సాగు పంటలకు సంబంధించి పంటకోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలని గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ నిర్మలాజ్యోతి తెలిపారు. మండలంలోని గొట్లాంలోని రైతుసేవా కేంద్రంలో వీఏఏలకు పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు.

జంక్ ఫుడ్‌కు దూరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాభారతి

గంట్యాడ: పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సీడీపీఓ ఉమాభారతి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని నరవ ఏఎంజీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బర్గర్లు, పిజ్జాలు, న్యూడిల్స్, చాట్స్ వంటివి ఎక్కువుగా పిల్లలు తినడం వల్ల అనారోగ్య సమస్యలు, ఊబకాయం వచ్చే అవకాశం ఉందన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

ఆదాయం సమకూర్చుకోవాలి

- ఎంపీడీఓ బి. కల్యాణి


మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.కల్యాణి

గజపతినగరం: గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఎంపీడీఓ బి. కల్యాణి అన్నారు. గురువారం స్థానిక పాత మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మండల లెవిల్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనీస్ ప్రొగ్రామ్‌లో ఆమె మాట్లాడుతూ.. పంచాయతీలు సొంత నిధులు ఎలా సమకూర్చుకోవాలి.. ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటి ఎంపీడీఓ జనార్దనరావు, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, శిక్షకులు రామ్‌నాథ్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి చెందాలి..


దత్తిరాజేరు: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్


కొత్తవలస: శిక్షణ కార్యక్రమానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులతో ఎంపీడీఓ రమణయ్య

పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సొంత ఆదాయాన్ని సముపార్జించుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై అధికారులు పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం నిర్వహించిన సదస్సుల్లో అధికారులు మాట్లాడుతూ.. పన్నులు వసూలు చేసుకుంటూ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. తద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. బొండపల్లి మండలంలో మాత్రం 28 సర్పంచ్‌లుండగా కేవలం ఎనిమిది మంది మాత్రమే హాజరవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

– మెరకముడిదాం/దత్తిరాజేరు/కొత్తవలస/బొండపల్లి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: గర్భాం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, జిన్నాం సబ్‌స్టేషన్ పరిధుల్లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.రఘు గురువారం సాయింత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గజపతినగరం, పురిటిపెంట, జిన్నాం, గంగచోళ్లపెంట, పత్రువాడ, కొత్తబగ్గాం,
పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడిపేట, కొనిశ, మెంటాడ, మర్రివలస, సాలిపేట, చిట్టాయవలస, మరుపల్లి, మధుపాడ, తమ్మారాయుడి పేట, గుడివాడ, ఎన్‌జీఆర్ పురం, శ్రీరంగ రాజపురం, లింగాలవలస, లోగిశ, కెంగువ, మల్లునాయుడుపేట, రంగుపురం, రామన్నపేట, సీతారామపురం, పిడిశీల గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శృంగవరపుకోట: పట్టణంలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్, ఎడ్లవీధి, కందాల వీధి, గరల్స్ హైస్కూల్, కాపువీధి, చింతావీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్, ముత్యాలమ్మగుడి, విశాఖ డెయిరీ, మల్లిపూడి స్టోన్ క్రషర్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతినగరంలో భారీ వర్షం

గజపతినగరం: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గజపతినగరం – మెంటాడ జంక్షన్ రోడ్డులో నీరు చెరువును తలపించడంతో ఐదారు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అలాగే పురిటిపెంట న్యూకాలనీలో కూడా ఫ్యామిలీ మార్ట్ వద్ద నీరు నిలిచిపోవడంతో స్థానికులకు అవస్థలు తప్పలేదు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో స్థానికులు భయాందోళన చెందారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



శృంగవరపుకోట: ప్రమాదవశాత్తు రైలు కింద పడడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన పొట్నూరు గణేష్ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఎస్.కోటలో రైల్వేట్రాక్‌కి అవతల ఉన్న తన స్నేహితుని ఇంటికి వెళ్లాడు. రైల్వేగేట్ వేసి ఉన్నప్పటికీ పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎడమ కాలు మోకాలి వరకు నుజ్జునుజ్జయింది. వెంటనే స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి గణేష్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.